కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

- వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి
- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తాడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తోందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలను అందించడంతో పాటు సాగులో సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డిని సన్మానించారు. అదేవిధంగా 54 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి చెక్కుల దర ఖాస్తుతో వచ్చే వారు కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాచారం ఇచ్చి వారి వెంట రావాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో జ్యోతి ఫరోషియా, డీటీ మహమ్మద్ అలీ, సింగిల్‌విండో సీవో ఆంజనేయులు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తాడూరులో సింగిల్‌విండో భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులకు మేలు చేయడం
మా బాధ్యత

- జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్ప



అయిజ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా రైతులకు మేలు చేసే బాధ్యత మాపై ఉంటుంది. విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తా. రైతులకు మద్ధతు ధరను లభించేందుకు ప్రస్తుతం వరి, పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికను సిద్ధం చేశాం. త్వరలోనే వాటిని ప్రారంభిస్తాం' అని గద్వాల జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పుష్ప ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు..?

జిల్లాలో ఒక పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పా టు చేస్తాం. రైతులందరికీ అందుబాటులో ఉండాలని అలంపూర్ చౌరస్తాలో ప్రారంభించాలని అకుంటున్నాం. ఈ ప్రాంతంలో పత్తి సాగు అధి కంగా ఉంటుందని ఇక్కడే ఏర్పాటు చేస్తున్నాం.

పత్తి సాగు విస్తీర్ణం ఎంత.. దిగుబడి ఎంత రావచ్చు?

జిల్లా మొత్తంగా 1.29 లక్షల ఎకరాలలో పత్తి సాగుచేశారు. మొత్తంగా 12 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

మద్దతు ధర ఎంత ఇస్తున్నారు? దీనిని ఎవరు కొనుగోలు చేస్తారు?

పత్తికి మద్ధతు ధర క్వింటాలుకు రూ. 7,521 ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ధర చెల్లించి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తాం. దీనిని సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు చేస్తుంది. వర్షాలు కురుస్తున్న కారణంగా పత్తి తడిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంది. ఈ విషయంలో పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నిర్ణయం తీసుకుని పత్తి కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తాం.


సెల్‌కే జై



తీరిక సమయాల్లో మీరేం చేస్తారు? దేనికి ప్రాధాన్యం ఇస్తారు? మొబైల్ ఫోన్‌లో నిమగ్నమవుతారా? కుటుంబంతో గడుపుతారా? స్నేహితులు, సహోద్యోగులతో సరదాలకు టైం కేటాయిస్తారా? వ్యక్తిగత ఆసక్తులపై దృష్టి సారిస్తారా? అని అడిగితే యువతరం ఏమంటోంది... మధ్య వయస్కులు ఏమి చెబుతున్నారు.. వృద్ధులు ఏం చేస్తామంటున్నారో తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వే చేసింది. ఆయా వర్గాల ప్రజలను పలుకరించింది. తీరిక సమయాన్ని దేని కోసం కేటాయిస్తున్నారో తెలుసుకున్నది. ఆ వివరాలు మీ కోసం...

- మహబూబ్‌నగర్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మీ రోజువారీ తీరిక సమయాల్లో దేనికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు?



- మెజారిటీ యువత సెల్‌ఫోన్లోనే నిమగ్నం
- వ్యక్తిగత ఆసక్తులపై అత్యంత తక్కువ సమయం
- కుటుంబం, వ్యక్తిగత ఆసక్తులకు వృద్ధుల ప్రాధాన్యం
- కుటుంబానికి మధ్య వయస్కుల ఎక్కువ సమయం
- తీరిక సమయాల్లో ప్రాధాన్యాలపై 'ఆంధ్రజ్యోతి' సర్వేలో వెల్లడి

మారుతున్న కాలమాన పరిస్థితుల్లో మనుషుల అభిరుచులూ మారుతున్నాయి. సెల్‌ఫోన్ లేని సమయంతో పోల్చితే.. ఇప్పుడు మనుషుల ప్రాధాన్యాల్లో చాలా తేడాలు వచ్చాయి. కొందరు అవసరాల కోసం.. మరికొందరు కాలక్షేపం కోసం సెల్‌ఫోన్‌లోని సామాజిక మధ్యమాల్లో మునిగితేలుతున్నారు. ఒకప్పుడు సమయం దొరికితే వ్యక్తిగత ఆసక్తులైన పుస్తక పఠనం, టీవీలో వార్తలు చూడటం, ఇరుగుపొరుగుతో ముచ్చట్లు, స్నేహితులతో సరదా సంభాషణలకు కేటాయించేవారు. ఇప్పుడు మెజారిటీ జనం తీరు మారిపోయింది. సెల్‌ఫోన్ లేని కుటుంబం అంటూ లేని స్థితిలో ఎక్కువ శాతం మంది దానికే సమయం కేటాయిస్తున్నారు. దీనివల్ల కొంత మంచి జరుగుతుండగా.. బంధాలు, బాంధవ్యాలు, స్నేహాలు, వ్యక్తిగత అభిరుచులపై మమకారం తగ్గుతోంది. ఇవే అంశాల ప్రాతిపదికన తీరిక సమయాల్లో ప్రజలు దేనికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే విషయంపై 'ఆంధ్రజ్యోతి' మూడు వయసు గ్రూపులకు చెందిన వారితో సర్వే నిర్వహించింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో మొత్తం 2,100 శాంపిళ్లు సేకరించింది. అందులో ఎక్కువ మంది సెల్‌ఫోన్ చూడటానికే జై కొట్టారు. వృద్ధుల్లో కూడా కొంతమంది సెల్‌ఫోన్

- మిగతా 7వ పేజీలో..

ఫోన్లలో మునుగుతున్నారు

నాకు చిన్నప్పటినుంచి క్రీడలంటే చాలా ఇష్టం. తీరిక సమయాల్లో ఆటలాడటానికి ఆసక్తి చూపించేవాణ్ణి. ప్రస్తుతం క్రీడలకు చాలా తక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఖాళీ సమయం దొరికిందంటే చాలు మొబైల్ ఫోన్లు చూడటంలో మునుగుతున్నారు. పాఠశాలలో సరైన మైదానం లేక క్రీడలు ఆడించే పరిస్థితి లేకుండా పోయింది. క్రీడల వల్ల దేహదారుఢ్యం పెరగడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారు. విద్యార్థులను క్రీడలవైపు ప్రోత్సహించాలి.



- దాసరి నరేశ్, హన్వాడ



నిత్యజీవితంలో ఫోన్ అంతర్ భాగమైంది

నిత్య జీవితంలో ఫోన్ అంతర్భాగమైంది. ఫోన్ లేకపోతే ఎలాంటి సమాచారం లేకుండా పోయే ప్రమాదం ఉందని చాలామంది భావిస్తున్నారు. ఫోన్ లేక పోతే జీవితం చాలాభారంగా ఉంటుంది. ఎలాంటి వయస్సు వారికైనా ఫోన్ లేకపోతే క్షణం గడవడం భారమైంది. దీని ద్వారా ఎంత మంచి ఉందో.. అంతే చేడు కూడా ఉంది.



- తిరుపతిరెడ్డి, కల్వకుర్తి పట్టణం

ఆ బాలికలు మైదానంలో చిరుతలు

- ఎస్‌జీఎఫ్‌లో సత్తా చాటుతున్న నడిగడ్డ విద్యార్థినులు
- జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న క్రీడాకారిణులు


గద్వాల తేరు మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

6

ముగిసిన పర్యటన

- వారం రోజులపాటు క్షేత్ర స్థాయిలో పర్యటించిన సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు
- ఈ అనుభవాలు భవిష్యత్ ఉద్యోగ జీవితంలో ఉపయోగపడతాయి : కలెక్టర్ బీఎం సంతోష్


కలెక్టర్ బీఎం సంతోష్‌తో సమావేశమైన ట్రైనీ అధికారులు

6


సర్వేపై అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పకడ్బందీగా కుటుంబ సర్వే

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభమయ్యే సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, జిల్లా అధికారులు, తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడానికి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలు త్వరలో జారీ చేస్తామని తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క ఇల్లు, కుటుంబం వదలకుండా సర్వే చేసేందుకు ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, వీఏవోలను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేయాలని సూచించారు. మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్, ఎంపీడీవో, ఎంపీవో తదితర సిబ్బందిని సూపర్‌వైజర్‌లుగా ఎంపిక చేయాలన్నారు. కుటుంబ సర్వేపై మాస్టర్ ట్రైనర్‌లు త్వరలో శిక్షణ ఇస్తారని తెలిపారు. వనపర్తి జిల్లాలో ఐదు మునిసిపాలిటీలతో పాటు 228 రెవెన్యూ గ్రామాలు, అందులో 262 గ్రామ పంచాయతీల్లో సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. 2011 తరువాత కొత్తగా ఏర్పడిన ఆవాస ప్రాంతాలు, ఇళ్లను గుర్తించి ఎన్యుమరేటరు బ్లాకులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీవో పద్మావతి, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మత్తు వదిలేలా..!

- జిల్లాకు నార్కోటిక్ డాగ్, టెస్టింగ్ కిట్లు
- డ్రంకెన్ డ్రైవ్ తరహాలో డ్రగ్ అండ్ డ్రైవ్స్
- స్కూల్స్, కాలేజీలతో పాటు జిల్లాపై నజర్
- గంజాయి తీసుకున్నా.. విక్రయించినా కఠిన చర్యలు

డ్రగ్స్ నియంత్రణకు సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులకు ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. గంజాయి, డ్రగ్స్‌ను గుర్తించేందుకు టెస్టింగ్ కిట్లు పంపిణీ చేశారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లకు డ్రగ్స్ తీసుకున్న వారిని గుర్తించే కిట్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. గంజాయి వాసనను పసిగట్టే నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల కొత్తకోట బస్టాండ్, వివిధ ప్రాంతాలలో తనిఖీలు చేశారు.

- వనపర్తి అర్బన్

6


నార్కోటిక్ డాగ్‌తో కొత్తకోటలో తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

కులగణన సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుల గణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కుల గణన సర్వేపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కుల గణనకు 1,721 బ్లాకులు ఏర్పాటు చేశామన్నారు. అదనపు కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించామని పేర్కొన్నారు. కులగణనలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, నాలుగు మునిసిపాలిటీల కమిషనర్లు, సీపీవోలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల స్థాయి నుంచే..

పట్టణానికి చెందిన నందిని ఆరవ తరగతి నుంచే ఫుట్‌బాల్ క్రీడలో ప్రతిభ చూపుతోంది. తొలిసారి 2023లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గద్వాలలో నిర్వహించిన అండర్-14 విభాగం నుంచి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో నిర్వహించిన 67వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2023-24 గర్ల్స్ ఫుట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హతను దక్కించుకున్నది. కోచ్ సహకారంతో రాబోయే రోజుల్లో జాతీయస్థాయి క్రీడాకారిణిగా రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు, పేరు తేవడమే తన లక్ష్యంగా తెలిపింది.



గద్వాల తేరు మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఆ బాలికలు మైదానంలో చిరుతలు

» ఎస్‌జీఎఫ్‌లో సత్తా చాటుతున్న నడిగడ్డ విద్యార్థినులు » జాతీయ స్థాయి ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న క్రీడాకారిణులు

ఆ బాలికలు మైదానంలో దిగితే చిరుతల్లాగా చెలరేగుతారు. ప్రత్యర్థి జట్టుకు ముచ్చెమటలు పట్టిస్తారు. ఫుట్‌బాల్ క్రీడలో జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన బాలికలు కొందరు జిల్లా స్థాయిలో రాణిస్తుండగా, మరికొందరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. వారిలో కొందరు క్రీడాకారిణులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వారి క్రీడా ప్రస్థానాన్ని తెలుసుకున్నది. ఆ వివరాలు మీ కోసం...

గద్వాల అర్బన్ (ఆంధ్రజ్యోతి)

జోగుళాంబ గద్వాల జిల్లా ఫుట్‌బాల్ ఆటకు పెట్టింది పేరు. ఈ ప్రాంతానికి చెందిన పలువురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

పలువురు బాలికలు ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో సత్తా చాటి నడిగడ్డ ఖ్యాతిని చాటి చెప్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుండటంతో బాలికలు అందిపుచ్చుకుంటున్నారు. వారిలో నలుగురు క్రీడాకారిణులు ఐదేళ్ల సాధనతో క్రీడలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకొని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా క్రీడా చరిత్రలో కొత్త అధ్యయానికి శ్రీకారం చుట్టారు.

హైస్కూల్ స్థాయి నుంచే...



గద్వాలకు చెందిన బాలిక శివాని హైస్కూల్ స్థాయి నుంచే ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో రాణిస్తోంది. జిల్లా స్థాయి, రూరల్ గేమ్స్‌లో, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విజయవాడలో నిర్వహించిన ప్రాబబుల్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకుంది. 2014 మార్చిలో జార్ఖండ్ రాష్ట్రం, రాంచీలో నిర్వహించిన స్వామి వివేకానంద ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని, గద్వాల నుంచి జాతీయస్థాయికి ఎదిగిన తొలి మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఫుట్‌బాల్ క్రీడలో తనదైన ప్రతిభతో దూసుకెళ్తున్న ఆమె క్రీడా కోటలో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడమే తన లక్ష్యమని తెలిపింది.



గద్వాల పట్టణానికి చెందిన రక్షితా రెడ్డి కోచ్ విజయకుమార్ ఇచ్చిన సలహాలు, సూచనలతో గోల్ కీపర్‌గా జాతీయ స్థాయికి ఎదిగింది. 2017లో అండర్ 014 స్టేట్‌మీట్‌లో రాణించి, 64వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. 2019-20లో అండర్-17 సీనియర్ స్టేట్‌మీట్‌లో మంచిర్యాలలో నిర్వహించిన 65వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యింది. 2019-20లో ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో నిర్వహించిన సబ్ జూనియర్స్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నారు. అలాగే 2019-20లో

కోచ్ విజయకుమార్ సహకారంతో...

మంచిర్యాలలో నిర్వహించిన సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. అసోం రాష్ట్రంలోని గౌహతిలో 20 22-23లో నిర్వహించిన హీరో జూనియన్ ఉమెన్స్ జూనియ న్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. అదే సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా పోటీల్లో గోల్‌కీపర్‌గా కీలక పాత్ర పోషించింది. 2023-24లో వెస్ట్ బెంగాల్‌లో నిర్వహించిన 28వ సీనియర్ నేషనల్ (సంతోష్ ట్రోఫీ) ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. 2023-24లో నిజామాబాద్‌లో నిర్వహించిన సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబరు 15 నుంచి 26 వరకు వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో నిర్వహించిన 29వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొన్నది.

మెరికల్లా తీర్చిదిద్దడమే లక్ష్యం



క్రీడలపై ఆసక్తితో పాటు ప్రతిభ ఉన్న వారిని గుర్తించి మెరుగైన శిక్షణ వచ్చి మెరికల్లా తీర్చిదద్దడమే లక్ష్యం. ఫుట్‌బాల్ క్రీడకు పురిటి గడ్డగా పేరున్న గద్వాలలో తొలిసారి మహిళా క్రీడాకారులను తీర్చిదిద్దడాన్ని సవాల్‌గా స్వీకరించి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. ప్రతిభావంతులకు సరియైన శిక్షణ ఉంటే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించడం పెద్ద కష్టమేమీ కాదు. ఆ దిశగా బాలికలకు శిక్షణ ఇస్తూ, ప్రోత్సహిస్తున్నాం. - విజయ్‌కుమార్, ఫుట్‌బాల్ కోచ్, గద్వాల

ఫుట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్‌లో...



గద్వాల పట్టణానికి చెందిన కరిష్మా ఏడవ తరగతి నుంచే ఫుట్‌బాల్ క్రీడలో రాణించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. 2016లో భువనగిరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటిసారి పాల్గొని అండర్-14 విభాగంలో రాణించింది. 2017లో వరంగల్ జిల్లా డోర్నకల్ నిర్వహించిన అండర్-17 విభాగంలో ఉత్తమ క్రీడకారిణీగా గుర్తింపు పొందింది. అదే ఏడాది గుంటూరులో నిర్వహించిన జోనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లోనూ ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచింది. ఫుట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్‌లోనూ నైపుణ్యాన్ని కనబరుస్తున్న ఆమె ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయిలో నిర్వహించిన వంద మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. 2016లో జిల్లా తరఫున జోనల్ లెవల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొని స్టేట్‌మీట్‌కు ఎంపికైంది. 2018లో 64వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గర్ల్స్ ఫుట్‌బాల్ అండర్-17 విభాగం నుంచి అగర్తలలోని త్రిపురలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నది. 2019లో ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అరుణాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన ఉమెన్స్ ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొన్నది. 2020లో 65వ స్కూల్స్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. 2023లో హీరో-27 సీనియర్ ఉమెన్స్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చింది.

జడ్చర్లకు అదనపు పోలీసులను కేటాయించండి

● డీజీపీ జితేందర్‌ను కలిసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా అదనపు పోలీసు సిబ్బందిని కేటాయించాలంటూ రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో సోమవారం డీజీపీని కలిసి అదనపు పోలీసు సిబ్బంది కేటాయింపుకు సంబంధించిన అంశాన్ని వివరించారు. జడ్చర్ల పట్టణంలో ప్రస్తుతం దాదాపు 1.25లక్షల జనాభా ఉందని, ప్రతి రోజు 30వేల మంది రాకపోకలు సాగిస్తారని తెలిపారు. ముఖ్యంగా జడ్చర్ల పట్టణం మీదుగా 44వ, 167వ నెంబరు గల రెండు జాతీయ రహదారులున్నాయని పేర్కొన్నారు. అలాగే రైల్వే ద్వారా పెద్దసంఖ్యలో ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయని, వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని వివరించారు. జడ్చర్ల పట్టణంలో అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడానికి, వాహనాల రాకపోకల నియంత్రణకు, ప్రజలకు మరింత రక్షణ కల్పించడానికి అదనపు పోలీసు సిబ్బంది అనవరం ఎంతో ఉందని డీజీపీకి ఎమ్మెల్యే వివరించారు. డీజీపీ సానుకూలంగా స్పందించారని, అందుకు తగ్గ చర్యలు తీసుకుంటానని వెల్లడించారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

పలువురు అధికారుల బదిలీ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు, అదనపు కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలను బదిలీ చేస్తూ.. సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్‌ను మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేసింది. మెదక్ జిల్లా అదనపు కలెక్టర్‌గా కొనసాగుతున్న జి.వెంకటేశ్వర్లును వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా నియమిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. వనపర్తి ఆర్డీవో పద్మావతిని నారాయణపేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గాను, నారాయణపేట ఆర్డీవో మధుమోహన్‌ను వనపర్తి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్.డీ.సీ)గా బదిలీ చేశారు. వనపర్తి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీ.హెచ్ వెంకటేశ్వర్లును భూపాలపల్లికి బదిలీ చేశారు. నల్గొండ ఎస్.డీ.సీగా పని చేస్తున్న సుబ్రహ్మణ్యంను వనపర్తి ఆర్డీవోగా నియమించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్ 2024 ఫిబ్రవరి 17న వనపర్తిలో బాధ్యతలు స్వీకరించారు. పార్లమెట్ ఎన్నికల విధులు, రెవెన్యూ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించారు.

పేట అదనపు కలెక్టర్, ఆర్డీవో..

నారాయణపేట(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.అశోక్‌కుమార్ భూపాల్‌పల్లి రెవె న్యూ అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. యాదాద్రి జిల్లా భువనగి రి రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ పి.బెన్‌సేలామ్ నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా ఇక్కడికి రానున్నారు. అలాగే నారాయణపేట ఆర్డీవోగా గద్వాల ఆర్డీవో పి.రామ్‌చందర్ ఇక్కడికి రానుండగా, పేట ఆర్డీవో మధుమోహన్ వనపర్తికి బదిలీ అయ్యారు.

గద్వాల ఆర్డీవో..

అలంపూర్ చౌరస్తా(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు, అదనపు కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలను బదిలీ చేస్తూ.. సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా గద్వాల ఆర్డీవో రామ్‌చందర్‌ను నారాయణపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

దాడి కేసులో జైలు శిక్ష

గోపాల్‌పేట, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఓ వ్యక్తిపై దాడి సంఘటనలో ఓ నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష పడిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బత్తుల నాగేశి ట్రాక్టర్‌పై తన పొలానికి వెళ్తున్నాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన బత్తుల చిన్నబుచ్చి ఇక్కడ బాట లేదని నాగేశిపై రాయితో దాడి చేశాడు. ఈ సంఘటనలో నిందుతుడు చిన్న బుచ్చిపై న్యాయస్థానం సంవత్సరం పాటు జైలు శిక్ష రూ.ఐదు వందల జారిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యం దాటిన విద్యుత్ ఉత్పత్తి

- ఎనిమిది యూనిట్ల ద్వారా కొనసాగింపు

ఆత్మకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిందని ప్రాజెక్టు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువ నుంచి వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నాలుగు యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో గడిచిన 24 గంటల్లో నాలుగు యూనిట్లను ప్రారంభించి 4.130 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని కొనసాగించామని తెలిపారు.

అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 321.783 ఉత్పత్తిని రాబట్టామని తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో నాలుగు 4.605 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగిందని అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 305.838 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టామని తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తి జరిగే అవకాశం ఉందన్నారు.



దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి సూచిక బోర్డులు






ప్రమిదలు.. విభిన్న ఆకృతులు

- దీపావళి కొనుగోళ్లు

నారాయణపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వెలుగునిచ్చే దీపావళి పండుగను నారాయణపేట జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి ప్రధాన కూడళ్లలో విభిన్న ఆకృతుల ప్రమిదలు విక్రయించేందుకు మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు. ఇంటి ముంగిట్లో దీపాలు వెలిగించి దీపావళి వేడుకలు జరుపుకుంటారు. మార్కెట్‌లో లభించే విభిన్న ఆకృతుల ప్రమిదలు కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రమిదలు సైజును బట్టి పది రూపాయలకు రెండు, మూడు చొప్పున విక్రయిస్తున్నారు. విభిన్న ఆకృతులను బట్టి అలంకరణల ప్రమిదలు ఆకృతులకు అనుగుణంగా ధరలు పలుకుతున్నాయి.



ముగిసిన ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల పర్యటన



ట్రైనీ శిక్షణాధికారులతో కలెక్టర్ బి.ఎం. సంతోష్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో వారం రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించిన ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల పర్యటన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో ఆల్ ఇండియా సర్వీసెస్ (ఏఐఎస్), సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (సీసీఎస్) 25 మంది శిక్షణాధికారులతో కలెక్టర్ బీ.ఎం సంతోష్ సమావేశాన్ని నిర్వహించారు. వారం రోజులుగా జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటించి వివిధ ప్రభుత్వ పథకాలు, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ విభాగాల తమ పరిశీలన ఫలితాలను, అనుభవాలను కలెక్టర్‌కు వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను అభినందిస్తూ, ఈ అనుభవాలు మీ భవిష్యత్ ఉద్యోగ జీవితంలో ఉపయోగపడతాయని, ప్రజాసేవ కోసం ఇది మంచి శిక్షణగా నిలుస్తుందన్నారు. అలాగే శిక్షణాధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ పథకాలు, పరిపాలన సంస్థల పనితీరు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గద్వాల జిల్లాలోని చేనేత పరిశ్రమ, ఆలయాలు, మార్కెటింగ్, ఉపాధి అవకాశాలు, ప్రసాద్ పథకం, మహిళా శక్తి పథకాలు వంటి అంశాలపై తమకు అవగాహన పెరిగిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టరు నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ ఉన్నారు.

మత్తు వదిలేలా..!

వనపర్తి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. కొన్ని సంవత్సరాలుగా మత్తుకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్న యువత ఆట కట్టించేందుకు పోలీసులకు ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌కు టెస్టింగ్ కిట్లు కూడా పంపిణీ చేశారు. అందులో భాగంగా వనపర్తి జిల్లా వ్యాప్తంగా మండలాల పోలీస్ స్టేషన్‌లకు ఒక్కొక్క డ్రగ్ అండ్ డ్రైవ్ కిట్టు, వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట పోలీస్ స్టేషన్‌లకు రెండు కిట్లు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే గంజాయి వాసనను పసిగట్టేందుకు తెచ్చిన నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల కొత్తకోట బస్టాండ్, వివిధ ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్‌తో పోలీసులు తనిఖీలు చేశారు.

గంజాయి టెస్టింగ్ కిట్లు

మద్యం తాగి వాహనాలను నడిపే వారిని పట్టుకునేందుకు పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహించే తరహాలో గంజాయి తీసుకునే వారిని పట్టుకునేందుకు కూడా పోలీస్ శాఖ డ్రగ్ అండ్ డ్రైవ్ టెస్టు కిట్లను అందుబాటులోకి తెచ్చింది. టెస్టు తరువాత గంజాయి తీసుకున్నట్లు నిర్ధారణ అయితే వారిని జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించి పరీక్షలు చేయిస్తారు. అక్కడే మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.

గ్రామాలకు పాకిన డ్రగ్స్..

గంజాయికి బానిసైన వారిలో 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు వారే అధికంగా ఉంటారు. ఈ నేపథ్యంలో యువతను గంజాయి, డ్రగ్స్ వ్యసనాల నుంచి విముక్తి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఉక్కు పాదం మోపుతున్నారు. గతంలో గంజాయి పట్టణాలకే పరిమితమయ్యేది. కానీ ప్రస్తుతం గ్రామాలకు కూడా పాకింది.

దీంతో జిల్లా వ్యాప్తంగా నార్కోటిక్ బృందాలు ఏర్పాటు చేసి గంజాయి వాడకంపై ఉక్కుపాదం మోపుతున్నారు. మత్తుకు బానిసైతే కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు, బహిరంగ ప్రదేశాలలో అవగాహన కల్పిస్తున్నారు.



కొత్తకోట బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

జీవితాలను నాశనం చేసుకోవద్దు



గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. మత్తు పదార్థాలు వాడడంతో పాటు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపడుతున్నాం. ఈ రెండు రోజుల్లో టెస్టింగ్ కిట్ల ద్వారా డ్రగ్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపడతాం. ఎక్కడైనా గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే నేరుగా పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వండి. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- రావుల గిరిధర్, ఎస్పీ

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ

- మహబూబ్‌నగర్ బాలికల జట్టు శుభారంభం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఖోఖో బాల, బాలికల బాస్కెట్ బాల్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ బాలికల జట్టు, మెదక్‌పై 18-08 గెలిచి శుభారంభం చేసింది. బాలుర విభాగంలో మెదక్ జట్టు మహబూబ్‌నగర్‌పై 28,22 తేడా గెలిచింది. బాలుర విభాగంలో వరంగల్ జట్టు ఖమ్మంపై 28-20, రంగారెడ్డి జట్టు కరీంనగర్‌పై 16-14, ఆదిలాబాల్ జట్టు నల్గొండపై 28-24 స్కోర్‌తో గెలిచాయి. బాలికల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఖమ్మంపై 12-10, నల్గొండ జట్టు కరీంనగర్‌పై 26-10, ఆదిలాబాద్ జట్టు 19-06 స్కోర్ తేడాతో గెలిచాయి.



తలపడుతున్న మహబూబ్‌నగర్, మెదక్ బాలుర జట్లు

నవంబర్ 4న యోగా, 6న రగ్బీ జట్ల ఎంపికలు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నవంబర్ 4న ఉమ్మడి జిల్లా యోగా, 6న ఉమ్మడి జిల్లా రగ్బీ అండర్-14, 17 బాల,బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని, బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో రావాలని సూచించారు. యోగా క్రీడాకారులు 9440292044, రగ్బీ క్రీడాకారులు 8919193768 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్



కల్వకోల్ బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- మృతదేహంతో కుటుంబీకుల రాస్తారోకో

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వకోలులో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో శివ(21) మృతి చెందాడు. దీంతో యువకుడి మృతదేహంతో సోమవారం రాత్రి కల్వకోల్ బస్టాండ్ చౌరస్తాలో బాధిత కుటుంబ సభ్యులు రాస్తారోకో నిర్వహించారు. కుమారుడు మృతిపై తల్లి లక్ష్మీ పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో సోమవారం రాత్రి కల్వకోల్‌కు తీసుకువచ్చి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. పట్నంశివ మృతికి కారకులైన జ్యోతితో పాటు, సహకరించిన నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని, కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇప్పించాలని నినాదాలు చేశారు. ఎస్‌ఐ సతీష్ ఆందోళన ఉధృతం కాకుండా బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి సముదాయించారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి



మృతి చెందిన దాచారం శ్రీను

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై సోమవారం సాయంత్రం పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. పెద్దకొత్తపల్లి మండలం శాఖాపూర్ చెందిన దాచారం శ్రీను అలియాస్ కోళ్ల శ్రీను (40) చెన్నపురాంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకొని గంద్రావుపల్లి స్టేజీ సమీపంలో విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేస్తున్నారు. పనిలో నిమగ్నమైన శ్రీను అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభం పైనుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శివలీల, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఆర్టీసీ బస్సులో బ్యాగు చోరీ

- రూ.2.80లక్షల విలువైన బంగారు వస్తువులు అపహరణ

జడ్చర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల న్యూబస్టాండులో ఆగి ఉన్న బస్సులో నుంచి ప్రయాణికుల బ్యాగులు చోరీ అయ్యాయి. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు... జనగాం జిల్లా సంజయ్‌నగర్‌కు చెందిన భార్యభర్తలు ఆంజనేయులు, ఉపేంద్రలు సోమవారం కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటిగంటప్రాంతంలో జడ్చర్ల కొత్తబస్టాండులో భోజనం కోసం ఆర్టీసీ బస్సు ఆగింది. ఇదే సందర్భంలో భార్యభర్తలు ఇద్దరు వెంట తెచ్చుకున్న బ్యాగులను బస్సులో ఉంచి బస్టాండులో తినుబండారాలు తీసుకుని బస్సులోకి వచ్చారు. కాగా బస్సులో ఉంచిన రెండు బ్యాగులు చోరీకి గురయినట్లుగా గుర్తించారు. బ్యాగులో రెండుతులాల బంగారు నెక్లెస్, రాళ్ల బిళ్లతో కూడిన రెండు తులాల నాను, రెండు తులాల నల్లపూసల దండ, 9రాళ్లతో ఉన్న ఏడు గ్రాముల బంగారు ఉంగరం, రెండు తులాల పుస్తెలతాడులు చోరీ అయ్యాయని, వీటి విలువ రూ.2.80లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలు కాసం ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

పల్లెగడ్డలో పట్టపగలు చోరీ

- రూ.లక్ష నగదు, 80 తులాల వెండి, తులంన్నర బంగారు అపహరణ

మరికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం పల్లెగడ్డ గ్రామంలో పట్టపగలు ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాలె శివరాములుతో పాటు కుటుంబ సభ్యులందరూ సోమవారం ఉదయం తమ సొంత పొలంలో పత్తి తీసేందుకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి వంటగదిలో తాళం చెవి పెట్టి వెళ్లిపోయారు. అయితే వంటగదికి తాళం వేయకపోవడంతో దొంగలు తాళం తీసుకొని ఇంటికి తెరిచి లోపల ఉన్న బీరువాను పగలగొట్టి విలువైన వస్తువులు, రూ.లక్ష నగదు, 80 తులాల వెండి, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో శివరాములు మరికల్ సంతకు వెళ్లేందుకు గాను పొలం నుంచి ఇంటికి వచ్చాడు. ఇల్లు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో పోలీసులు వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఇంటి ముందు దొంగ చెప్పులను వదిలివెళ్లాడు. శివరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మురళి తెలిపారు.

మద్దూర్‌లో అర్ధరాత్రి తాగుబోతు హల్‌చల్

- మద్యం మత్తులో చిరు వ్యాపారుల తోపుడు బండ్లు విధ్వంసం

మద్దూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూర్ పాత బస్టాండ్‌లో ఓ తాగుబోతు ఆదివారం అర్ధరాత్రి హల్‌చల్ చేశాడు. తాగిన మైకంలో చిరువ్యాపారుల తోపుడుబండ్లపై విరుచుకుపడి నానా విధ్వంసం సృష్టించాడు. విషయం తెలుసుకున్న చిరు వ్యాపారులు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారమందించారు. హల్‌చల్ సృష్టిస్తున్న మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన వ్యక్తిని స్టేషన్‌కు తరలించి, తాగిన మద్యం శాతాన్ని పరికరంతో పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంలాల్ తెలిపారు.

సెల్ కే జై





(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్నట్లు సర్వేలో తెలపడం గమనార్హం.

యువతరం.. మొబైల్‌లోనే నిమగ్నం

తీరిక వేళల్లో దేనికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే విషయంపై 684 మంది యువతీ యువకులను సర్వే చేయగా.. అందులో 381 మంది సెల్‌ఫోన్‌తోనే కాలం గడుపుతున్నామని చెప్పారు. అంటే దాదాపు 50 శాతం యువత తీరిక సమయాల్లో సెల్‌ఫోన్‌లో నిమగ్నమవుతున్నారు.

ఎక్కువగా సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్, యూట్యూబ్‌లను చూస్తున్నట్లు వెల్లడించారు. అయితే వ్యక్తిగత ఆసక్తులపై అతి తక్కువ మంది సమయం కేటాయిస్తున్నారు.

దీనివల్ల అనేక అనర్థాలు వచ్చే అవ కాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వ్యక్తిగత ఆసక్తులపై శ్రద్ధ పెట్టకపోవడం వల్ల కేరీర్ డెవలప్‌మెంట్‌లో వెనుకబడే అవకాశం ఉంది. పుస్తక పఠనం, సమకాలీన అంశాలపై అవగాహన కల్పించుకోవడం వల్ల ఉద్యోగం, వృత్తి, ఉపాధి రంగాల్లో మెరుగ్గా రాణించే అవకాశం ఉంది.

సమయం సమపాళ్లు

మధ్య వయస్కులకు సంబంధించి 714 శాంపిళ్లు సేకరించగా, ఈ కేటగిరి ప్రజలు తమ సమయాన్ని దాదాపుగా సమపాళ్లలో కేటాయిస్తున్నారు.

ఈ వయసు గ్రూపులో ఉద్యోగులు, వివిధ వృత్తుల పని వారు, గృహిణులు ఉన్నారు. వీరిపై అనేక బాధ్యతలు ఉన్నం దున అధిక శాతం మంది కుటుంబానికి సమయం ఎక్కువగా కేటాయిస్తున్నట్లు సర్వేలో వెల్లడయ్యింది.

కుటుంబం తర్వాత సెల్‌ఫోన్‌కు సమ యం ఇస్తున్నారు. ఆ తర్వాత వ్యక్తిగత అభిరుచులు, స్నేహితులతో గడపటం చేస్తున్నట్లు వెల్లడయ్యింది.

కుటుంబానికే ఎక్కువ సమయం

వృద్ధులు తమ తీరిక సమయాల్లో ఎక్కువ గా కుటుంబంతో గడిపేందుకు ఇష్టపడుతు న్నారు. ఈ కేటగిరిలో వయసు మీద పడిన వారు.. ఉద్యోగ విరమణ తీసుకున్నవారు, సె ల్‌ఫోన్ రాని కాలం నుంచి ఉన్న వారు.. సెల్ ఫోన్ వాడటం తెలియని వారే అధికంగా ఉన్నారు. వారి అభిరుచులు యువతకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఈ కేటగిరీలో మొత్తం 702 శాంపిళ్లు సేకరించగా.. అందులో 249 మంది వృద్ధులు కుటుంబానికి సమయం కేటాయిస్తున్నట్లు తెలిపారు. అలాగే వీరు వ్యక్తిగత ఆసక్తులపై కూడా ఎక్కువ శ్రద్ధనే కనబరుస్తున్నారు. 206 మంది తీరిక సమయాల్లో తమ వ్యక్తిగత ఆసక్తులపై దృష్టి పెడుతున్నట్లు వెల్లడించారు.

సమయాన్ని వృథా చేయొద్దు



ఉరుకు పరుగుల జీవితంలో కాస్తంత సమయం దొరికితే కుటుంబానికి వెచ్చించాలే తప్పా, దొరికిన సమయాన్ని వృథా చేయొద్దు. మేము వ్యాపారం చేస్తాం.. తీరికలేకుండా ఉంటుంది. కాస్తంత సమయం దొరికినప్పుడు చిన్న పిల్లలతో ఆడుకోవడం, లేదంటే స్నేహితులతో కాలం గడపడం ఎంతో హాయినిస్తుంది.

- మిరియాల విజయ్‌బాబు, వ్యాపారి, అచ్చంపేట

నిత్య జీవితంలో సెల్‌ఫోన్ భాగమైంది



ప్రస్తుతం ప్రతీ వ్యక్తి జీవితంలో సెల్‌ఫోన్ భాగమైంది. సెల్‌ఫోన్ కాసేపు లేకుంటే గందరగోళంగా ఉంటుంది. మన వారు ప్రపంచంలో ఎక్కడ ఉన్న ప్రతి నిమిషం వారితో మాట్లాడవచ్చు. ప్రపంచ సమాచారం కూడా క్షణాల్లో తెలిసిపోతుంది. ఉద్యోగ సమయంలో కూడా సెల్‌ఫోన్ ఎక్కువ అవసరం పడుతుంది. పిల్లలు మొబైల్‌లో కార్టూన్ చిత్రాలు చూస్తు అన్నం తింటారు. ఆరోగ్యంగా ఉండొచ్చు.

- చింటూ అరుణ్ తేజ , కొల్లాపూర్

సెల్‌ఫోన్‌కు ఆకర్షితులవుతున్నారు..



చాలా మంది సెల్‌ఫోన్లకు ఆకర్షితులై పోతున్నారు. గతంలో మేము చిన్నతనంలో చదువుకొనే సమయాల్లో మాకు సాయంత్రం పూట ఊరి చివరిలో ఒక చిన్న గ్రౌండ్‌లో ఆటలు ఆడుకొనేవారం. అవి కూడా ఏమి ఆటలంటే కబడ్డీ, వాలీబాల్, కర్రబిళ్లా, కోతి కొమ్మలాటలు, వీటితోపాటుగా చిన్న-చిన్న ఆటలు ఆడుకొనేవారం. అయితే సెల్‌ఫోన్ ఎప్పుడైతే అందుబాటులోకి వచ్చిందో అప్పటి నుంచి చాలా మంది సోషల్ మీడియాకు ఆకర్షితులవుతున్నారు. **- ఆంజనేయులు, అన్నాసాగర్, భూత్పూర్**

కుటుంబంతో గడుపుతా



నేను కోల్‌కతాలో ఆర్మీ ఉద్యో గం చేస్తున్నాను. డ్యూటీ అయి పోయాక సాయంత్రం కాసేపు వ్యాయామం చేస్తాను. అనంతరం కుటుంబం, పిల్లలతో గడుపుతా. వారాంతంలో బయటి ప్రదేశాలను చూడడానికి వెళ్తాం. మొబైల్ ఫోన్‌లో కేవలంలో సమాచారం కోసమే చూస్తాను. టీవీ చూస్తే క్రీడలకు సంబంధించిన అంశాలే చూస్తాను.

- వరదరాజు, ఆర్మీ ఉద్యోగి, కల్వకోలు

కుటుంబంతో ఎక్కువ సేపు గడుపుతా



నాకు 62 ఏళ్లు పిల్లల పెళ్లిళ్లు చేశాను. ప్రస్తుతం కుటుంబ సభ్యులతో కాలయాపన చేస్తాను. కాసేపు టీవీ, దైవభక్తికి సంబంధించిన పుస్తకాలు చదువుతాను. రోడ్డుపైకి వెళ్తే ఎవరైనా మా వయస్సు వారు కలిస్తే కబుర్లాడుకుంటాం. ఇక ఈ నాటి యువకులకు ఏమైన మంచి మాటలు చెబుతామన్నా వినే స్థితిలో లేరు. మా మనవరాళ్లు, మనవళ్లు ఎప్పుడైన ఇంటికి వస్తే ముబైల్ ఫోన్‌లోనే కాలక్షేపం చేస్తారు. దీని వల్ల మానవ సంబంధాలు దూరమైతున్నాయనిపిస్తుంది.

- జగదీశ్వరయ్య, శాంతినగర్

సెల్‌ఫోన్ మాయ నుంచి బయటపడాలి



సమాచార సేకరణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంగా వినియోగించాల్సిన సెల్‌ఫోన్లు సర్వాంతర్యామిగా మారడం ఆందోళనకరం. సెల్‌ఫోన్ వాడకం పెరగడంతో పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో పాటు సెల్‌ఫోన్ మాయలో ఉన్న ప్రస్తుత యువతరం బంధువుల, స్నేహితులతో కూడా సరైన సంబంధాలు కొనసాగించలేక పోవడం దురదృష్టకరం. ఈ పరిస్థితి మార్చేందుకు ప్రతీ ఒక్కరు తమవంతు బాధ్యతను, పాత్రను పోషించాల్సి ఉంది.

- ఎం.నరసింహ, ప్రైవేటు ఉద్యోగి

యోగాతో మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి



వయసు పైబడిన వారు తీరిక సమయాల్లో యోగా, ధ్యానం, మొక్కల పెంపకం చేస్తూ.. మనసును ప్రశాంతంగా ఉంచుకొని కుటుంబ సభ్యులతో సంతోషకరమైన జీవితం గడపాలి. శరీరం సహకరిస్తే సేవా కార్యక్రమాల్లో పాల్గొని యువతకు ఆదర్శంగా నిలవాలి. విద్యార్థులు యువత సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి అవసరమైన మేరకు వినియోగించుకోవాలని అవగాహన కల్పించాలి.

- వడ్ల సత్యనారాయణ, విశ్రాంత జీహెచ్ఎం, మానాజిపేట

మొబైల్‌లో ఆధ్యాత్మిక అంశాలు చూస్తాను



నేను రోజంతా కూరగాయల హోల్‌సేల్ వ్యాపారంలో బిజీగా ఉంటా. ఖాళీ సమయం దొరికితే మొబైల్ ఫోన్ చూస్తా. అందులో యూట్యూబ్‌లో ఆధ్యాత్మిక అంశాలు ఎక్కువగా చూస్తాను. కొన్ని సమయాల్లో పాటలు వింటాను. సాయంత్రం పూట గ్రౌండ్‌లో కాసేపు వాకింగ్ చేస్తాను.

- ఎస్.మురళీ, కూరగాయల వ్యాపారి, నాగర్‌కర్నూల్

కుటుంబానికి సమయం కేటాయించాలి..



నేటి సమాజంలో ప్రతీ ఒక్కరూ కుటుంబానికి సమయం కేటాయించాలి. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ వ్యాయామంతో పాటు, వాకింగ్ చేయాలి. యువత ముఖ్యంగా సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి క్రీడలపై ఆసక్తి కనబర్చాలి. పిల్లలు సెల్‌ఫోన్లు వాడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

- బి.గోపాలం, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు, మక్తల్

నడకతో ఎంతో ఆరోగ్యం



ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడం వల్ల 80 ఏళ్లు ఉన్నా ఆరోగ్యంగా ఉన్నా. సెల్‌ఫోన్ వినియోగంలో పడి కుటుంబానికి సమయం ఇవ్వని పరిస్థితి నేటి యువతలో నెలకొంది.

ప్రతీ ఒక్కరూ తమ చేతనైనంత వరకు సామాజిక సేవల్లో పాల్పంచుకొని పదిమందికి ఉపయోగపడాలి.

పెంటమీది నారాయణ, మరికల్,

కుటుంబ సభ్యులతోనే..



మిడ్జిల్: బయట ఎన్నో ఒత్తిళ్లతో సతమతమవుతుంటాం. తీరిక సమయాలలో కుటుంబ సభ్యులతో గడిపితే చాలా సంతోషంగా ఉంటుంది. కుటుంబంతో తీరిక సమయాల్లో కలిసి ఉండటం వల్ల ఇంట్లో ఎవరేం చేయాలనే స్పష్టత వస్తుంది. చిన్నచిన్న సమస్యలు కూడా దూరమవుతాయి.

- మోహన్‌బాబు, మిడ్జిల్, జడ్చర్ల

నాయకుల వీడియోలు, ఇంటర్వ్యూలు వింటా



నేను మేస్త్రీ పని చేస్తుంటా. నాకు ఖాళీ సమయం దొరికినప్పుడల్లా రాజకీయ నాయకుల వీడియోలు, నాయకులు ఇచ్చిన ఇంటర్వ్యూలు వింటుంటాను ఎందుకంటే కొంతమంది నాయకులు మాటల్లో రాష్ట్ర స్థాయి, దేశ స్థాయిలో ఉన్న రాజకీయ సమాచారం, గతంలో ఉన్న సమాచారం తెలుస్తుంది.

- అశోక్, యువకుడు, కోస్గి

కొండాపూర్‌లో జోరుగా కల్తీకల్లు అమ్మకాలు

- అస్వస్థతకు గురైన కల్లు ప్రియులు

ధన్వాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండలం కొండాపూర్ గ్రామంలో కొన్నిరోజుల నుంచి కల్తీ కల్లు అమ్మకాలు జోరుగా నిర్వహిస్తున్నారు. కల్తీ కల్లు అమ్మకాలు చేపట్టడంతో ఇటీవల కొంతమంది కల్లు తాగి అస్వస్థతకు గురైనట్లు సమాచారం.

ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా కల్లు అమ్మేవారు అస్వస్థతకు గురైన వారిని ఎవరికీ చెప్పొద్దంటూ ప్రాధేయపడినట్లు తెలుస్తోంది. అయితే స్థానికంగా ఇక్కడ ఎలాంటి ఈత చెట్లు లేకపోవడం, దానికి కొండాపూర్‌లోనే ఓ షట్టర్‌లో కృత్రిమ కల్లు తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈత చెట్లతోనే కల్లు అమ్మకాలు కొనసాగించాలి. కాని ఈత చెట్ల కల్లు కాకుండా కృత్రిమ కల్లు తయారు చేసి అమ్మడం వల్ల చాలమంది కల్లు ప్రియులు అనారోగ్యానికి గురవుతున్నారు.

స్థానికంగా పలుకుబడి, సంబంధిత అధికారులకు ముడుపులు ఇస్తుండటంతో ఇక్కడ కల్లు అమ్మకాలు ఎలా పడితే అలా కొనసాగుతున్నాయి. కృత్రిమ కల్లు తయారుచేసే సమయంలోను కల్లు సీసాలను సైతం సరిగ్గా కడగకుండా అదేవిధంగా నింపడం వల్ల చాలామంది అనారోగ్యాలకు గురవుతున్నారు.

ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు కల్లు దుకాణం ఇళ్ల మధ్య కొనసాగించడం వల్ల ఇంటి చుట్టుముట్టు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

మేలైన వేరుశనగ రకాల సాగుతో అధిక ఉత్పత్తి



బిజినేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ సామూహిక ప్రదర్శన క్షేత్రాల ద్వారా మేలైన వేరుశనగ రకాల సాగు చేపట్టి అధిక ఉత్పత్తినిచ్చే వాటిని రైతులకు అందించవచ్చని కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఖానాపూర్, వసంతాపూర్, తాడూరు మండలంలోని యత్మతాపూర్, పర్వతాపూర్, నాగర్‌కర్నూల్ మండలంలోని నల్లవెల్లి చెందిన రైతులకు వేరుశనగలో సామూహిక ప్రదర్శన క్షేత్రాలపై శిక్షణ నిర్వహించి అవగాహన కల్పించారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద అధిక మొత్తంలో నూనె గింజ పంటల సాగును ప్రోత్సహించి, 40 ఎకరాల్లో వేరుశనగ పంటను సామూహిక ప్రద ర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి రైతులకు కీలక ఉత్పాదకాలు, వినియోగం, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించినట్లు తెలిపారు. అన ంతరం అవసరమైన కలుపు మందులు, క్రిమి సంహారకాలను రైతులకు అందజేశారు. కార్యక్ర మంలో కేవీకే శాస్త్రవేత్తలు బి.రాజశేఖర్, కె.రామ కృష్ణ తదితరులు ఉన్నారు.

శివ పార్వతుల విగ్రహాల ఊరేగింపు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

అచ్చంపేట అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం భక్తులు ద ర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పాపనాశిని గుండంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, ఈశ్వ రునికి క్షీరాభిషేకం, పంచా మృతాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన, గణపతి, అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు రామ్మూర్తి, వీరయ్య, రాజశేఖర్, ఆనంద్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయం ఆవరణలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు కుంకుమార్చనలు చేశారు. అనంతరం సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు పల్లకీలో ఊరేగించారు. గుండంలో పుణ్యస్నానాలు, చక్రస్నానాలు చేయించి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

యూనివర్సిటీకి పేరు తీసుకురావాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

- చెన్నై బయలుదేరిన పీయూ కబడ్డీ జట్టు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మన యూనివర్సిటీకి గుర్తింపు మంచిపేరు తీసుకురావాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూ పరిపాలన భవనం ఆవరణలో ఆలిండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలో పాల్గొనేందుకు చెన్నై బయలుదేరిన పాలమూరు యూనివర్సిటీ కబడ్డీ పురుషుల జట్టు క్రీడాకారులకు పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ట్రాక్‌సూట్, టీమ్ యూ నిఫామ్ అందజేశారు. ఈ పోటీలు ఈ నెల 30 నుంచి నవంబర్ 3వరకు జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఎడీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌తో పీయూ కబడ్డీ పురుషుల జట్టు

పత్తి కొనుగోలు ప్రారంభం

పాలమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పత్తి సీజన్ 2024-25లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించినట్లు జిల్లా సీసీఐ జిల్లా అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిరైతులు ప్రయోజనాలను కాపాడేందుకు సీసీఐ శాఖ మహబూబ్‌నగర్ పరిధిలోని 9జిల్లాలో 30కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మరిన్ని వివరాలకు రైతులు సీఓటీ-ఏఎల్ఎల్‌వై మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. తమ పత్తి సీసీఐకి కనీస మద్దతు ధరకు విక్రయించాలనుకునే పత్తిరైతుల నమోదు ప్రక్రియ ప్రామాణికమైన ఆధార్ నంబర్ ఆధారంగా ఈ పత్తి సీజన్‌లో కొనసాగుతోందన్నారు. నాణ్యతాప్రమాణాలలో ఒక్కటైన తేమ శాతాన్ని నిర్దేశిస్తూ పత్తిలో తేమ శాతం 8శాతం మించకపోతే, సీసీఐ పత్తిరైతులకు పూర్తి కనీస మద్దతు ధర(యం.ఎస్‌పీ)చెల్లిస్తుందన్నారు.

తేమ శాతం 8శాతం కంటే ఎక్కువ 12శాతం మించకపోతే సీసీఐ కనీస మద్దతు ధరను 8శాతం ఎక్కువ తేమ ఉంటే ప్రతి ఒక్కశాతానికి తదనుసారంగ కనీస మద్దతు ధర చెల్లిస్తుందన్నారు.

పత్తి రైతులు తమ పత్తిని ఆరబెట్టి సీసీఐకి తెచ్చి అమ్మితే పూర్తి మద్దతు ధర ఎలాంటి తగ్గింపులు లేకుండా పొందాలని తెలిపారు.

ఎట్టి పరిస్థితుల్లో పత్తిలో 12శాతం తేమ కంటే ఎక్కువ ఉండరాదన్నారు. మరిన్ని వివరాలకు రైతులు సీసీఐ శాఖ కార్యాలయం 08542-222210లో సంప్రదించాలన్నారు.

ఇంటర్వ్యూ..



వైద్యుల సలహాతోనే

మందులు వాడండి

- పదర వైద్యాధికారి సుధాకర్

పదర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సలహా లేకుండానే చిన్నపాటి జ్వరాలకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారు. అవి భవిష్యత్‌లో చాలా ప్రమాదకరం అని పదర పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

పీహెచ్‌సీ పరిధిలో ఎన్ని సబ్ సెంటర్లున్నాయి?

పదర పీహెచ్‌సీ పరిధిలో పది సబ్ సెంటర్లున్నాయి. వాటన్నీటిని మేమే పర్యవేక్షిస్తాం. ఆయా సబ్ సెంటర్లకు ప్రత్యేక సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రిలో సరిపడ సిబ్బంది ఉన్నారా?

సరిపడ సిబ్బంది లేరు. ఆరోగ్య పరీక్షలు నిర్వంచడానికి ల్యాబ్ టెక్నీషియన్ లేరు. సిబ్బంది గురుంచి ఉన్నతస్థాయి అధికారులకు నివేదించాం.

వసతులు ఎలా ఉన్నాయి?

అత్యవసర పరిస్థితికి ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు వస్తుంది. కానీ బోర్ బాగు చేయిస్తే బాగుంటుంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు మరమ్మతు చేయించాలి.

వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారా?

రెండు వారాలకు ఒకసారి పాఠశాలలో, చెంచు పెంటల్లో సిబ్బందితో కలిసి శిబిరాలు ఏర్పాటు చేసి, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. అవసరం ఉన్న వారికి మందులు ఇస్తున్నాం.

సీజనల్ వ్యాధులపై మీ సలహా?

వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలంటే కాచి చల్లార్చిన నీరు తాగాలి. క్రమం తప్పకుండా కిలోమీటరుపైగా నడవాలి. పరిశుభ్రత పాటిస్తూ జంక్ ఫుడ్ తగ్గించి, ఇంట్లో ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలి.

న్యూస్ బాక్స్

అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలి

తాడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భరత్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

అమ్మ పేరుతో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కల్వకుర్తిటౌన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): అమ్మపేరుతో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ కోరారు. సోమవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మై భారత్ జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్య ంలో (ఏక్ పేడ్ మా కా నామ్) అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలునాటి, విద్యార్థు లకు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ప్రదీప్‌కుమార్, పాతిమా, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే తడి, పొడి చెత్త వేరు చేయాలి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కల్వకుర్తి టౌన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచే తడి, పొడి చెత్త వేరు చేయాలని అంగన్‌వాడీ టీచర్ సుజాత, మునిసిపల్ వర్కర్ యాదగిరి అన్నారు. సోమవారం పట్టణంలోని బలరాం నగర్ కాలనీవాసులకు అవగాహన కల్పించా రు. అపరిశుభ్రత వల్ల దోమలు, ఈగలు బెడదతో విషజ్వరాలు, డెంగీ, టైఫాయిడ్ వ్యాప్తి చెందుతాయని తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ఊర్కొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట బాల్ రామయ్య పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జార్జ్ సోమవారం తెలిపారు. పోటీల్లో పాల్గొననున్న జశ్వంత్, చంద్రహాస్, మైత్రిలను పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. కరస్పాండెంట్ బాల్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ రామ్, వ్యాయమ ఉపాధ్యాయుడు భీమ్ ఉన్నారు.

కోతకు గురైన ఘాట్ రోడ్డు



రహదారి కోతకు గురై గుంతగా ఏర్పడిన మలుపు ఘాట్ రోడ్డు

» అదుపు తప్పితే పెను ప్రమాదం

» రహదారి సైడ్ మరమ్మతులను మరిచిన అధికారులు

మన్ననూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నల్లమల ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు కుంచోని మూల ఘాట్ రోడ్డు కోతకు గురై సైడ్‌లు గుంతలమయమైంది. అమ్రాబాద్, పదర మండలాలతో పాటుగా శ్రీశైలం, హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే ఘాట్ రోడ్డుకు మెయింటెనెన్స్ పనులు చేపట్టాల్సిన జాతీయ రహదారుల అధికారులు మరిచిపోయారు. మన్ననూరు సమీపంలోని నిరంజన్ షావలి దర్గా నుంచి కుంచోని మలుపు నర్సరీ వరకు ఘాట్ రోడ్డు కోతకు గురైంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి ఈ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే బస్సు, లారీల వంటివి ద్విచక్ర వాహనాల వారు సైడ్ దిగే క్రమంలో గుంతల్లో వాహనం జారి కిందపడి గాయాలపాలవు తున్నారు. అధికారులు స్పందించి కోతకు గురైన రహదారికి మరమ్మతు చేపట్టాలని నల్లమల వాసులు కోరుతున్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

» డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్

చారకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, వరిధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం, వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులు సహకారసంఘం ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. కర్షక మిత్ర ద్వారా రూ.10 లక్షల వరకు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు భూపాల్‌రావు, వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, పురుషోత్తంరావు, మేనేజర్ రఘునాథ్, ఏవో తనుజ, డీజీఎం రమేష్, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



అచ్చంపేటలో వినతిపత్రం అందజేసిన నాయకులు

బిజినేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ధర్నాగ్రహ దీక్షలో భాగంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తహసీల్దారు శ్రీరాములుకు తపస్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏల విడుదల, ఇతర సమస్యల పరిష్కారం చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వారి వెంట ఉపాధ్యాయులు రామకృష్ణ, భాగ్యలక్ష్మి, రాధా తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కేశవకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు రాజేష్, మల్లారెడ్డి, అశోక్, చంద్రశేఖర్ వినతి పత్రం అందచేశారు. ఉప్పునుంతల మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నాగ్రహ దీక్ష చేపట్టారు.

డీఏలను వెంటనే విడుదల చేయాలి

అచ్చంపేట టౌన్: ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ నాలుగు డీఏలు, మెడికల్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ధర్మాగ్రహదీక్షలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ అశోక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

పెద్దకొత్తపలి: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ఒకేసారి విడుదల చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాముడు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం ఒక డీఏను చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు.

అమ్రాబాద్: పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తపస్ ఆధ్వర్యంలో సోమవారం అమ్రాబాద్ తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు.

మాదిగలను కించపరిస్తే చూస్తూ ఊరుకోం

» త్వరలో మాదిగ ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తాం

» మాదిగల ఐక్య వేదిక పార్లమెంట్ ఇన్‌చార్జి మంగి విజయ్



మాట్లాడుతున్న మంగి విజయ్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మాదిగలను కించపరిచే విధంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని మాదిగల ఐక్య వేదిక నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంగి విజయ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కపిలవాయి లింగమూర్తి కళా ప్రాంగణంలో మాదిగ ప్రజా సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్‌లో జరిగిన మాలల సభలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాట్లాడిన విధానాన్ని మాదిగలంతా ఖండిస్తున్నామన్నారు. ఏ సామాజిక వర్గమైనా వెనుకబాటుతనానికి అనుగుణంగా రిజర్వేషన్లు పంచుకోవచ్చని రాజ్యాంగం రాసిన అంబేద్కర్ కూడా చెప్పారన్నారు. వర్గీకరణతోనే ఎస్సీ ఉప కులాలన్నింటికీ సమ న్యాయం జరుగుతుందన్నారు. మాదిగలపై చేసిన వ్యాఖ్యలపై బాధ్యులైన మాలల ఆత్మ గౌరవ సభ కన్వీనర్ డాక్టర్ చెన్నయ్య, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న వారికి దీటుగా సమాధానం చెప్పేందుకు నాగర్‌కర్నూల్‌లో త్వరలో మాదిగ ధర్మ యుద్ధ మహాసభ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. లక్ష్మయ్య, ప్రదీప్, కాశన్న, శంకర్, విజయ్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలకు మేము వ్యతిరేకం కాదు'

» సీఎం వైఖరి మార్పు కోసమే మాలల ఆత్మగౌరవ సభ

» విలేకరుల సమావేశంలో సభ కన్వీనర్ డాక్టర్ చెన్నయ్య



మాట్లాడుతున్న డాక్టర్ చెన్నయ్య

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనాలోచితంగా వర్గీకరణ చేసేందుకు అనుకూలంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వైఖరి మార్చుకోవాలనే సూచనగా మాలల ఆత్మగౌరవ సభ నిర్వహించామని సభా కన్వీనర్ డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాల మహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాదిగలకు తాము వ్యతిరేకం కాదని, జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచకుండా, ఉన్న రిజర్వేషన్లనే పంచాలనే విభజన వాదులనే వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్సీలో ఉన్న 58 వర్గీకరణ చేస్తే కేవలం ఒక్కో గ్రూపులో ప్రధాన నాలుగు కులాలే లబ్ధి పొందుతాయే తప్పా మిగతా కులాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో జరిగిన మాలల ఆత్మ గౌరవ సభ కనివిని ఎరుగుని రీతిలో విజయవంతమైందన్నారు. రాష్ట్రంలో ఎస్సీలకు కల్పిస్తున్న కార్పొరేషన్ ద్వారా మాదిగలే అధిక లబ్ధి పొందారని, కనీసం మాదిగ ఉప కులమైన బైండ్లకు ఏనాడు సర్పంచ్ టికెట్ కూడా అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ నేత మనువాద బీజేపీతో కలిసి స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా లెక్కలు తేల్చి ఎస్సీ వర్గీకరణ ఆలోచనలు విరమించుకుని ఉన్న రిజరేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెట్టి శ్రీనివాస్, గోరటి సుధాకర్, వెంకటస్వామి, మద్దెల చంటి, సంకి కురుమయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

కొల్లాపూర్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఐదు రోజుల నుంచి తాగునీటి సరఫరా లేదని నిరసిస్తూ కాలనీవాసులు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. కొళాయిలకు తాగునీరు రావడం లేదని, కనీసం మునిసిపాలిటీ ట్యాంకుల ద్వారా కూడా నీటి సదుపాయం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ఖాళీ బిందెలు ఉంచి మహిళలు, యువకులు నిరసన తెలిపారు. మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలతో నీటి సరఫరా సమస్య నెలకొందని మునిసిపల్ సిబ్బంది తెలిపారు.

యాపట్లలో గ్యార్వీ వేడుకలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాపట్లలో గ్యార్వీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మహబూబ్ సుభాని గంధోత్సవాన్ని గ్రామంలో ఊరేగించి దర్గా వద్దకు తీసుకెళ్లారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జహంగీర్, మజీద్, నిరంజన్, సాధిక్, పర్హాన్, మునీర్, బషీర్, నిజాం, కాశీం, మసూద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

వెల్దండ, అక్టోబరు 28 : మండల కేంద్రంలో 22 గుంటల నక్షబాటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం జోగయ్య తహసీల్దార్ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల రాకపోకలకు నక్షబాట ఎంతో అవసరమని తెలిపారు. బాట ఆక్రమణలకు గురికాకుండా చూడాలని ఆయన కోరారు.

చేపపిల్లల పంపిణీ

వెల్దండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు మత్స్య పరిశ్రమ సహకార సంఘాలకు సోమవారం ప్రభుత్వం ద్వారా ఉచితంగా చేపపిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండల వ్యవసాయాధికారి శోభారాణి వెల్దండ, కొట్ర, చెర్కూర్, చౌదర్‌పల్లి, కుప్పగండ్ల, సిర్సనగండ్ల, జూపల్లి సొసైటీలకు చేపపిల్లలు అందజేశారు. మత్స్యకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి గిరి, జిల్లా మత్స్యకారుల సంఘం డైరెక్టర్ వెంకటయ్య, వెంకటయ్య, దేవేందర్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు

కొల్లాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జిల్లా పరిషత్ గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.14.75లక్షల నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని చైర్‌పర్సన్ సంధ్యారాణి, జీహెచ్ఎం శోభారాణి పేర్కొన్నారు. మిగిలి ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు, పెయింటింగ్, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, కాంపౌండ్ వాల్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పురోహితుడిని సత్కరించిన గ్రామస్థులు

అమ్రాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన అమరేశ్వర ఆలయ పురోహితుడు పీ శ్రీకుమార్ శర్మ నల్లమల ప్రాంతంలో బాల్య వివాహాల నిర్మూలన కోసం చేసిన కృషిని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ నాటక రంగస్థలం వారు రవీంద్ర భారతిలో ఇటీవలనే 'పురోహిత నంది అవార్డు'ను ప్రదానం చేశారు. మండల కేంద్రంలో సోమవారం శ్రీ కుమార్ శర్మను గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అమరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గంగిశెట్టి నాగరాజు, నరసింహులు, వెంకటయ్య, సుల్తాన్ యాదవ్, సురేష్, గౌడ్, తిరుపతయ్య, నిరంజన్ తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సీబీఎం ట్రస్ట్ చేయూత

అమ్రాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గంజి దేవేందర్, చంద్రకళ దంపతుల కూతురు మాధురికి ఇటీవల వరంగల్ జిల్లా నర్సపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. దీంతో ఆమె చదువుల కోసం సీబీఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనురాధ రూ.30 వేల చెక్కును సోమవారం అందజేశారు. మాధురి తండ్రి దేవందర్ తీవ్ర అనారోగ్య పరిస్థితిల నేపథ్యంలో, గత ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ ఇచ్చిన హామీ మేరకు ట్రస్ట్ తరఫున ఈ ఆర్థిక సాయాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా సాయం చేసి ఆదుకుంటామని ట్రస్ట్ చైర్మన్ అనురాధ హామీ ఇచ్చారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా యాదయ్యగౌడ్

కల్వకుర్తి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైనట్లు కల్వకుర్తి కబడ్డీ కమిటీ సభ్యులు సోమవారం ప్రకటనలో తెలిపారు. మల్కాజిగిరిలో జరిగిన రాష్ట్ర కబడ్డీ అకాడమీ సమావేశంలో యాదయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తిని రాష్ట్ర కమిటీలో ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

విమర్శించడం తగదు

అచ్చంపేటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మాల ఉద్యమనేతలను విమర్శించడం తగదని మాల మహానాడు నాయకుడు కుంద మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జిల్లాలో జరిగిన మాలల ఆత్మగౌరవసభ విజయవంతం కావడంతో కొంత మంది మాదిగలు మాలమహానాడు నేతలు, ప్రజాప్రతినిధులపై విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ప్రజావాణికి 80 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్‌లు సీతారామారావు, దేవ సహాయం

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రజావాణికి మొత్తం 80 వినతులు అందాయి. సోమవారం ప్రజల నుంచి వివిధ సమస్యలపై అందిన ఫిర్యాదులను అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, దేవ సహాయం స్వీకరించి విచారణ కోసం సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. పరిపాలనాధికారి చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒక ఏఎన్ఎం, ఏడు అకౌంటెంట్ ఉద్యోగాల ఖాళీలకు నవంబర్ ఆరవ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు సోమవారం ప్రకటనలో తెలిపారు. అకౌంటెంట్ ఉద్యోగం కోసం డిగ్రీ, ఎం.కాం కామర్స్, బీకాం కంప్యూటర్, బేసిక్ కంప్యూటర్ కోర్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఎస్సైని సన్మానించిన నాయకులు

అచ్చంపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను సోమవారం పాలశీతలీకరణ కేంద్రం చెర్మన్ దొడ్ల నర్సయ్య యాదవ్, గురునాయక్, వెంకటేష్, చరణ్ గౌడ్‌లు శాలువాతో సత్కరించారు. వచ్చే నెల 2న పాల శీతలీకరణ కేంద్రం చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

ఉప్పునుంతల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గోపిరెడ్డి రమేష్‌రెడ్డి సోమవారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ సత్తూ భూపాల్‌రావు, మాజీ అధ్యక్షుడు మద్దు నరేందర్‌రెడ్డి, సీఈవో రవీంద్రారావు సన్మానించారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.దశరథం, పంచాయతీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు బాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐదు నెలల నుంచి పంచాయతీ కార్మికులకు వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 5, 6 తేదీల్లో ఇందిరా పార్కు వద్ద జరిగే దీక్ష కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిద్దయ్య, బాలస్వామి, రమేష్‌నాయక్, పరశురాం, సిద్ధరాముడు, గణేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గీత కార్మికుల రక్షణకే కాటమయ్య కిట్ల పంపిణీ



కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు

కల్వకుర్తి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : గీతాకార్మికుల రక్షణకే ప్రభుత్వం కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన 56 మంది గీత కార్మికులకు మొదటి విడతలో కాటమయ్యకిట్లను నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఏడీ శ్రీరామ్, ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, జిల్లెల రాములు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకార్పాముల జెడ్పీహెచ్ఎస్ 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమకు విద్యను బోధించిన గురువులను సన్మానించి, జ్ఞాపికాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వేశ్వర్‌రెడ్డి, పాపల్ రాయుడు, వెంకటేశ్వర్లు, శేఖర్, గాయత్రి దేవి, స్వరూప, రోజా, విద్యార్థులు రవి, శ్రీకాంత్, బాలరాజ్, అన్వర్, పాషా, అశు పాల్గొన్నారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో మహర్దశ

» జిల్లాలో అథారిటీ పరిధిలోకి రానున్న 18 మండలాలు

» ఏజెన్సీ కూడా చేర్చాలంటూ డిమాండ్



నాగర్‌కర్నూల్ పట్టణ ముఖచిత్రం

నాగర్‌కర్నూల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాను అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ(నుడా) కింద చేర్చడంపై హర్షం వ్యక్తం అవుతుంది. వెనుకబడిన జిల్లాను అథారిటీ పరిధిలోకి చేర్చడంపై అర్బన్ ఏరియాతో పాటు దీని పరిధిలోకి వచ్చే పల్లెలు త్వరితగతిన అభివృద్ధి చెందనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అయిన నాగర్‌కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుపై జిల్లా ప్రజల్లో కూడా ఆశలు చిగురిస్తున్నాయి. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల ఉన్నాయి. వీటి పరిధిలో 18 మండలాలు ఉండగా, 319 పంచాయతీలను నాగర్‌కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ కింద చేర్చారు. అర్బన్ డెవల్‌మెంటు అథారిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధికంగా నిధులు కేటాయిస్తున్న క్రమంలో అథారిటీ కింద ఉన్న పట్టణాలు, రూరల్ ఏరియాల్లో ప్రజలకు అనేక మౌలిక సదుపాయాలు వినియోగంలోకి రానున్నాయి. జిల్లాలో ఇప్పటికి నాలుగు మునిసిపాలిటీలు ఉండగా ప్రజలకు సదుపాయాలు కల్పించడం, అభివృద్ధి అంశాల్లో చతికిల పడుతున్నాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మునిసిపాలిటీ పన్నుల వసూలు, విద్యుత్, నీటి సరఫరా విషయంలో దృష్టి సారించే అవకాశం ఉంది. రోడ్లు, పార్కులు, మునిసిపాలిటీ పరిధిలోని అనేక అంశాలలో అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ పరిధిలోకి రానుండడంతో అభివృద్ధి వేగవంతం కానుంది.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ ప్రతిపాదనలు అందించిన వెంటనే దానికి ఆమోదం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఏది అడిగినా సత్వరమే మంజూరు చేస్తున్నారు. నియోజవర్గంలో మరో మూడు అభివృద్ధి అంశాలు రానున్నాయి. త్వరలో వాటిని కూడా వెల్లడిస్తా.

- డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

ఏజెన్సీ ప్రాంతాలను చేర్చాలి



నుడా ఏర్పాటు చేసి 319 గ్రామాలను చేర్చడం అభినందనీయం. సాంకేతిక కారణాల దృష్ట్యా ఏజెన్సీ ప్రాంతాలు దీని పరిధిలోకి రాలేదు. ఇందులో అమ్రాబాద్, అచ్చంపేట, పదర మండ లాల్లో అనేక గ్రామాలు ఉన్నాయి. న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతా.

- డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే